www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 6 జులై 2024
5
వైఎస్ఆర్

నూతన కలెక్టర్‌గా
లోతేటి శివశంకర్ నేడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప

వైఎస్ఆర్ జిల్లా నూతన కలెక్టర్‌గా లోతేటి శివశంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా అధికారిక సమాచారం మేరకు ఉదయం 10.45 గంటలకు జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో లోతేటి శివశంకర్ బాధ్యతలను ఇటీవల రాష్ట్రంలోని సుమారు 18 జిల్లాల కు చెందిన కలెక్టర్లను బదిలీ చేసింది. ఇందు లోభాగంగా కడప కలెక్టర్‌గా లోతేటి శివ శంకర్ రానున్నారు. ఈయన బాధ్యతల నిర్వహణలో తనదైన ముద్రవేసినట్లు తెలుస్తోంది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు

ప్రజాశక్తి-చెన్నూరు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. సీజన్ వ్యాధులైన, డయేరియా, డెంగ్యూ, మలేరియా, మెదడు వాపు వ్యాధి, అతిసార వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి శుక్రవారం డ్రైడే ఫ్రైడే గురించి చెన్నూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెన్నూరు లోని అరుంధతి నగర్‌లో అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన అరుంధతి నగర్ వాసులతో మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంటూ, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. భోజనానికి ముందు, మలమూత్ర విసర్జన తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని తెలిపారు. గ్రామ సమీపంలోని గ్రామాల మధ్య ఇళ్ల వద్ద ఉన్న రోడ్లలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. సీజనల్ వచ్చే డయేరియా, డెంగీ, మలేరియా, బోదకాలు, అతిసార, మెదడువాపు వ్యాధి, వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వీటి గురించి అవగాహన కలిగి తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలు డయేరియా బారిన పడకుండా ఒఆర్ఎస్, జింకు మాత్రలు వాడాలని అక్కడ ప్రజలకు తెలియజేశారు. ఏమాత్రం ఆరోగ్యం బాగా లేకున్నా సూచనలు కనబడిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, లేదా సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిఎంఒ మనోరమ, పిహెచ్‌సి వైద్య అధికారి డాక్టర్ బి చెన్నారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, ఎఎంఒ వెంకటరెడ్డి, ముదిలి, బాల పుల్లయ్య, శంకర్ రెడ్డి, సూపర్‌వైజర్లు రిబక, లక్ష్మీదేవి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అతిసారపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

మిస్సింగ్ కేసుల విచారణ వేగవంతం

రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలి
గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా
నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి- కడప అర్బన్

మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అత్యధిక ప్రాధాన్యతతో వాటిని విచారించి అదృశ్యమైన వారి జాడ తెలుసుకుని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అదృశ్యమైన వారి ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేక టీమ్‌లు రాష్ట్ర, దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి విచారించాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక మేరకు పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కు పాదం మోపాలని పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, పరారీలో ఉన్న నేరస్తులను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాలని చెప్పారు.

నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి

ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. దొంగతనాల నిరోధానికి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్లను అమలు చేసేందుకు చర్యలు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) లోసారి సుధాకర్, జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డి అనుచరుడిపై దాడి

తీవ్రంగా గాయపడిన అజయ్‌రెడ్డి
ఆస్పత్రి వద్దకు భారీగా తరలి వచ్చిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి నాయకులు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి అనుచరుడైన అజయ్ కుమార్‌రెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో బాధితుడికి తీవ్రగాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. స్థానికులు, బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు.. వేంపల్లె మండలం తువ్వపల్లెకు చెందిన వి. అజయ్ కుమార్ రెడ్డి అనే యవకుడు వైసిపి నేత సతీష్ రెడ్డికి బంధువు కావడంతో ఆయన వెంట ఉండి ఆయా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. పులివెందుల రోడ్డులోని సతీష్ రెడ్డికి చెందిన పాఠశాల కార్యక్రమాలను చూసుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల విడిచి తర్వాత మోటర్ బైకులో శేఖర్ అనే వ్యక్తితో కలిసి బాధితుడు ఇంటికి వెళుతుండగా పాఠశాల సమీపంలోని దారిలో కాచి ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు మోటర్ బైకును అడ్డుకున్నారు. అజయ్‌కుమార్‌రెడ్డిని హాకీ స్టిక్స్, రాడ్లు, బండరాళ్లతో దాడి చేశారు. మోటర్ బైకుపై ఉన్న మరో వ్యక్తిపైనా కొందరు దాడి చేస్తుండగా అతడు తప్పించుకొని వెళ్లి పాఠశాలలో ఉన్న సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటినా సంఘటనా ప్రాంతానికి వెళ్లడం జరిగిందని స్థానికులు తెలిపారు. అప్పటికే దాడి చేసిన వ్యక్తులు వాహనాంలో పారిపోయారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వేంపల్లెలోని బిడ్డాల మిట్ట ప్రాంతంలో ఉన్న పోలింగ్ బూత్ వద్ద కొద్ది పాటి ఘర్షణ టిడిపి, వైసిపి నేతల మధ్య జరిగింది. అ సంఘటనను మనస్సులో పెట్టుకొని దాడి చేసినట్లు బాధితుడు అజేయ్ కుమార్ రెడ్డి తెలిపారు. వేంపల్లి మండల టిడిపి పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, రవితేజరెడ్డి వర్గీయులు దాడి చేసినట్లు బాధితుడు చెప్పారు. తీవ్ర గాయాలతో వేంపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని సతీష్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డితో పాటు వైసిపికి చెందిన పలువురు నాయకులు పరామర్శించారు. దాడి జరిగిన సంఘటనను తెలియడంతో వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు భారీగా సతీష్‌రెడ్డికి చెందిన వారు రావడంతో ఆసుపత్రి ఆవరణం వైసిపి నేతలతో కిటకిలాడింది. ఎంపి అవినాష్ రెడ్డి కూడ ఫోన్‌లో సంఘటనపై ఆరా తీశారు. ఘర్షణకు గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు సిఐ చాంద్ బాషా తెలిపారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడిలో గాయపడిన అజయ్ కుమార్‌రెడ్డి

గంజాయిపై ఉక్కు పాదం

- వైసిపి ఆక్రమిత స్థలాలు ప్రభుత్వం స్వాధీనం
- ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని, వైసిపి నాయకులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామని కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ద్వారకా నగర్‌లోని శ్రీనివాసరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చి ప్రభుత్వ, ప్రయివేటు భూములను కబ్జా చేశారని విమర్శించారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురై టిడిపి కూటమికి 164 సీట్లు కట్టబెట్టారని చెప్పారు. 2019లో సిఎం జగన్ ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచామని చెప్పి, 2024లో ఓడిపోయిన తర్వాత ఇవిఎంలు ట్యాంపరింగ్ అనడం సిగ్గుచేటు అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 20 రోజులు కాకముందే హామీలు అమలు చేయడం లేదని గగ్గోలు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఏడాది సమయం అన్నా ఇవ్వండని అన్నారు. ఇలాగే విమర్శిస్తే 2029లో వైసిపికి ఒక్క సీటు మాత్రమే వస్తుందని హెచ్చరించారు. సంక్షేమం, సుపరిపాలన, పారిశ్రామిక, ఐటి సెక్టర్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ పెద్దలతో మంతనాలు జరుపుతున్నారని చెప్పారు. జగన్ ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా సొంత ఆస్తులను పెంచుకోవడానికి చూశారని విమర్శించారు. అమరావతికి హెచ్‌ఆర్ సంస్థ మళ్ళీ వస్తూవుందని తెలిపారు. కార్పొరేషన్ జనరల్ బాడీ మీటింగ్‌లో శ్మశాన వాటిక, దోబీఘాట్ల ధ్వంసం, భూ కబ్జాలు, పాఠశాలల స్థలాల ఆక్రమణ, జడ్‌పి, పోలీసు స్థలాల ఆక్రమణపై చర్చించామని ఎమ్మెల్యే తెలిపారు. ఆక్రమించిన వాటిని స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. మెగా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. 117 జీవో రద్దు చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. మినిస్టర్స్ కాలనీ పేరుతో ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, దీనిని స్వాధీనం చేసుకుంటూ బోర్డు రెవిన్యూ అధికారులు నాటారని పేర్కొన్నారు. రామాంజనేయ పురంలో వంక పోరబోకు భూమిని కాపాడమని చెప్పారు. గంజాయి కేసులో పట్టుపడితే రౌడీషీట్ ఓపెన్ చేయమని పోలీస్ అధికారులను ఆదేశించామని ఎమ్మెల్యే తెలిపారు. ఉచిత పథకాల కోసం అధిక పన్నులు జగన్ వేశారని వాళ్ళ కార్పొరేటర్‌లే వాపోతున్నారని గుర్తు చేశారు. వీళ్ల అప్పుడు జగన్ను ఎందుకు అడగలేక పోయారని ప్రశ్నించారు. కొత్త డ్రామా ఆడవద్దని హితవు పలికారు. మహిళలపై దాడి చేయడం, అమ్మాయిలను ఎత్తుకొని పోతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎవరైనా చట్టానికి లోబడి ఉండాలని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక శక్తులను కాపాడేందుకు ఇక్కడ వైసిపి ఎమ్మెల్యేలు మంత్రులు లేరని గుర్తు చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

జిఒ 84పై ప్రభుత్వం పునఃసమీక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మున్సిపల్ విద్యా విధానంలో భాగంగా గత ప్రభుత్వం విద్యాశాఖ పరిధిలోకి పురపాలక, నగరపాలక పాఠశాలలను తీసుకొస్తూ ఉత్తర్వు 84ను జారీ చేసి అమలు చేసింది. దీనివల్ల మున్సిపల్ విద్యా విధానం అస్తిత్వానికే ప్రమాదంగా ఏర్పడిందని, దీనిని వెంటనే ప్రభుత్వం పునఃసమీక్షించాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విజయరామరాజు ఎస్‌టియు భవన్‌లో ఉత్తర్వు 84 పై కడప నగర అధ్యక్షులు సాదిక్ అలీ అధ్యక్షతన 'చర్చా వేదిక' నిర్వహించారు. వేదికలో ముక్తా ఖండంతో జీ.వో. నంబర్ 84 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో మున్సిపల్ పాఠశాలలు తీసుకున్నప్పటికీ ఇంతవరకు ఏ ఒక్క కొత్త పోస్ట్ మంజూరు చేయలేదని తెలిపారు. కడప నగరపాలకకు 30 పోస్టులు వరకు అదనంగా అవసరం ఉన్నప్పటికీ ఒక్క పోస్ట్ కూడా మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలో తీవ్ర ఉపాధ్యాయుల కొరత వల్ల ఉపాధ్యాయులపై పని భారానికి గురవుతున్నారని చెప్పారు. కడప నగరపాలక సంస్థ ప్రత్యేక చొరవతో గత సంవత్సరంలో సుమారు 98 విద్యా వాలంటీర్ల పోస్టుల రూపంలో అందించడం వల్లే గత విద్యా సంవత్సరం ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా నడిచిందన్నారు. మున్సిపల్, నగరపాలకలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఏ ఒక్కరికి కూడా ఇంతవరకు బదిలీలు, ఉద్యోగోన్నతలు జరపలేదని పేర్కొన్నారు. జీతాల కోసం ఎంఇఒ కార్యాలయం చుట్టూ తిరగడం తప్ప ఎటువంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలలో ఉన్న మైదానాలను, కమర్షియల్‌గా తాకట్టు పెట్టడానికి మాత్రమే జీవో నంబర్ 84 తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసంబద్ధ జీ.వోను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు నగర ప్రధాన కార్యదర్శి సంజీవ రాయుడు, ఆర్థిక కార్యదర్శి అస్లాం, జిల్లా నాయకులు బాబు పద్మాకర్, జిటి దామోదర, ఫక్రుద్దీన్, వై.శ్రీనివాసులు, రాజగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, ఆసిఫ్, ఖాసిం, హర్షద్, ఖాదర్ బాషా, ఖాజా పిర్, రాజశేఖర్ నాయక్, ఆర్. సికిందర్ బాష పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కలసపాడు : ప్రస్తుతం మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలకు బలైపోతున్న వారిని దృష్టిలో ఉంచుకొని ఇండియన్ పీనల్ కోర్టు అనేక చట్టాలను ఏర్పాటు ఏర్పాటు చేసిందని చట్టాలకు అనుగుణంగా ప్రజలు తెలుసుకొని మార్పు చెందేలా ముందుకు రావాలని, తహశీల్దార్ కృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సిడిపిఒ లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు, పోలీస్ విభాగంలో మహిళల సాధికారిక సంఘంలో భాగంగా ఈ అంశాలన్నింటినీ ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత మన పైన ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కోటేశ్వరరావు, ఎఎస్ఐ నాగేంద్ర, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి సిడిపిఒ లక్ష్మి, సూపర్‌వైజర్ హరి ప్రియ, కాశినాయన సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్వాడీలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పూడికల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రెయినేజీలలో శుక్రవారం పూడికల తొలగింపు పనులు చేపట్టారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో డ్రెయినేజీ కాలువలలో ఉన్న పూడికలు తొలగించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశించడంతో నగర పంచాయతీ అధికారులు శుక్రవారం పనుల ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ప్రధాన కాలువల్లోని పూడికలు తొలగించని కారణంగా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు ఇబ్బందికరంగా ఉండేది. డ్రైనేజీ కాలువలోని పూడిక తొలగింపు పనులను మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మధుకుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. వేంపల్లి రోడ్డు లోని ప్రధాన డ్రైయినేజీ కాలువ అసంపూర్తిగా ఉండడంతో ఊరి చివరనున్న స్థలాల్లో నీరు చేరేదని, శాశ్వత పరిష్కారం దిశగా దొండపాడు రస్తాలోని ప్రధాన కాలువకు అనుసంధానం చేసేలా నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అకడమిక్ కేలండర్ పంపిణీ చేయండి

ప్రజాశక్తి -కడప అర్బన్

2024 - 25 విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను కడప జిల్లా ఉమ్మడి పరీక్షల మండలి ద్వారా ముద్రించి అన్ని పాఠశాలలకు పంపిణీ చేయాలని కడప జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. అనురాధను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులవుతున్నా డిసిఇబి ద్వారా ముద్రించి పంపిణీ చేయాల్సిన లిస్ట్ ఆఫ్ హాలిడేస్ పాఠశాలలకు చేరలేదని తెలిపారు. అకడమిక్ కేలెండర్ సకాలంలో పాఠశాలలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని డిఇఒను కోరారు. డిఇఒఅనురాధ మాట్లాడుతూ ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌తో సంప్రదించి వీలైనంత త్వరగా ముద్రించి పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బిల్లా హరిప్రసాద్, యుటిఎఫ్ నాయకులు వెంకటరమణ, గంగాధర్ బాబు పాల్గొన్నారు.

9న సింహాద్రిపురం మండల సమావేశం

ప్రజాశక్తి-సింహాద్రిపురం : ఈనెల 9న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాల్మాన్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు అరుణ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

వైవీయూలో బిఇడి, ఎంఇడి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బిఇడి, ఎంఇడి 2,4 సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాలలో మొదలయ్యాయి. పరీక్షలను వైవీయూ రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి కడపలోని నాగార్జున కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డి కడపలోని నాలుగు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. నిర్వహణలో ఇబ్బందుల గురించి ఆరా తీశారు. కట్టుదిట్టంగా నిర్వహించాలని పరీక్షల అధికారులకు వారు సూచించారు. ప్రతి కేంద్రంలో విశ్వవిద్యాలయం నుంచి అబ్జర్వర్లను నియమించగా విశ్వవిద్యాలయ హైపవర్ కమిటీ కమలాపురం, ప్రొద్దుటూరు, బద్వేలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. అలానే వైవీయూలో జరుగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను తనిఖీ చేశారు.

పరీక్షలను తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరాలి

ప్రజాశక్తి - కడప : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులోని డిఎల్ఎస్ఎ భవన్‌లో 'ద్విచక్ర వాహనాలు, పిలియన్ డ్రైవర్ల వినియోగదారులు రక్షిత తలపాగా (హెల్మెట్) ఉపయోగించడంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించండి. .సురక్షితంగా గమ్యాన్ని చేరండి, హెల్మెట్ వాడకం సురక్షితం, హెల్మెట్ వాడక పోవడం చట్టరీత్యా నేరంఅవుతుందని తెలిపారు. మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలి అంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని, హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా ఉండాలి అని సూచించారు. ఐఎస్ఐ మార్క్ గల నాణ్యమైన హెల్మెట్లను వాడాలి, హెల్మెట్ ధరించడం పై అవగాహన పెంచుకోవాలి అన్నారు. కార్యక్రమంలో పురుషుల, మహిళల కేంద్రకారాగార సూపరిండెంట్లు డిస్ట్రిక్ సబ్ జైల్ ఆఫీసర్, న్యాయవాదులు, పోలీసులు, పారా లీగల్ వాలంటరీలు, ఎన్జీవోలు, వైద్యాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి పిల్లాడూ బడికి పోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : 6 నుంచి 14 సంవత్సరాల్లోపు ప్రతి ఒక్క పిల్లవాడు చదువుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం బడికి పోదాం అనే కార్యక్రమాన్ని 30 రోజులపాటు(జూన్ 13 నుంచి జూలై 12 వరకు) నిర్వహిస్తుందని కడప మండల విద్యాశాఖ అధికారులు దుద్దికుంట. గంగిరెడ్డి, షేక్. ఇషాద్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని కాగితాల పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో మనం బడికి పోదాం ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఐటిఐ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మనం బడికి పోదాం నినాదంతో విద్యార్థులు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అలీ అక్బర్, రాజశేఖర్, రమాదేవి జహీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామచంద్రయ్యను సన్మానిస్తున్న దుర్గాప్రసాద్

కాపు కార్పొరేషన్ పేరు మార్పునకు కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

కాపు కార్పొరేషన్ పేరు మార్పుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ రామచంద్రయ్యను టిడిపి రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్ కోరారు. శుక్రవారం రామచంద్రయ్య స్వగృహంలో కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కాపు, బలిజ, తెలగ కార్పొరేషన్‌గా మార్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విన్నవించాలని విజ్ఞప్తి చేశారు. మానవత్వం గత ప్రభుత్వం ఒకే కులానికి చెందిన వారిని మూడు వర్గాలుగా చీల్చే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ప్రాంతాలు వేరైనా కాపులు, బలిజలు, తెలగలు ఒకరే అన్నారు. ఐకమత్యంతో ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించామని చెప్పారు. జనాభా నిష్పత్తి ప్రకారం చైర్మన్, డైరెక్టర్ పదవులు కేటాయించి కార్పొరేషన్కు నిధులు మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సుమన్, సుధాకర్ పాల్గొన్నారు.

వసతి గృహంలో వైద్య సిబ్బంది తనిఖీ

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని చిన్న గురువలూరు గ్రామంలో ఉన్న బిసి బాలుర వసతి గృహంలో నీటి ట్యాంక్స్, మరుగుదొడ్లు, వంటగదులను శుక్రవారం వైద్య సిబ్బంది తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి యం. రాఘవయ్య మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వాటర్ ట్యాంక్‌ను, వంట సామగ్రిని శుభ్రంగా కడగాలని పేర్కొన్నారు. నీటి ట్యాంక్ పైన మూతలు ఉండాలని, డయేరియా రాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు. జ్వరాలు, విరేచనాలు వాంతులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతీ, బాబురెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి నాగకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మాజీ సిఎం జగన్ రాక

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ శనివారం కడప జిల్లా పర్యటనకు రానున్నారు. ఈనెల 8న తన తండ్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఇడుపులపాయలోని ఆయన సమాధి వద్ద నివాళులర్పించేందుకు రానున్నట్లు కడప మేయర్, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి విమానం ద్వారా కడపకు చేరుకొని రోడ్డు మార్గాన ఇడుపులపాయ వెళ్తారని తెలిపారు.

ఇన్‌స్టంట్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వైవీయూ అధికారులు అన్ని పరీక్షలకు ఇన్‌స్టంట్ అవకాశం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ కోరారు. శుక్రవారం వైవీయూ పరిపాలన భవన ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పరీక్షల నియంత్రణ అధికారి ఎన్. ఈశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ 2021- 2024 సంవత్సరం డిగ్రీ చదువుతున్న విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. 4వ సెమిస్టర్ వరకు ఒక్క పరీక్షకు మాత్రమే అవకాశం ఇవ్వడం వల్ల వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని గుర్తు చేశారు. అన్ని పరీక్షలు రాసుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పరీక్ష సమయాన్ని పొడిగించాలని కోరారు. స్పందించిన పరీక్షల నియంత్రణ అధికారి యన్.ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా విసి నియామకం జరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వనం శ్రీనివాసులుకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వ విద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకులు వనం శ్రీనివాసులుకు విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సహ ఆచార్యులు డాక్టర్ పి. ప్రమీల మార్గరెట్ పర్యవేక్షణలో 'ట్రైబల్ గర్ల్స్ ఎడ్యుకేషన్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ : ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు కడప డిస్ట్రిక్ట్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. ఆయన రాసిన పరిశోధన వ్యాసాలు పలు జాతీయ జర్నల్స్ ప్రచురితమయ్యాయి. జమ్మలమడుగు చెందిన గిరిజన విద్యార్థి వనం శ్రీనివాసులుకు డాక్టరేట్ రావడం పట్ల తల్లిదండ్రులు వనం నాగమ్మ, వనం భూషన్న, సోదరుడు వనం సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు. పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు డాక్టరేట్ పొందిన శ్రీనివాసులును అభినందించారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని కృష్ణ సర్కిల్‌లో ఉన్న యాకోబు సాహెబ్ మసీదు శ్మశాన స్థలాన్ని రోడ్ల విస్తరణలో భాగంగా కార్పొరేషన్ అధికారులు కూలదీస్తుంటే తమ మత విశ్వాసాలకు భంగం కలిగిస్తున్నారని పలువురు తమ నిరసన తెలియజేయడంతో అప్పటి డిప్యూటీ సిఎంఅంజాద్ బాషా ఒత్తిడి మేరకు వన్ టౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నంబర్ 445 /2023,446/2023,447/2023 లుగా అక్రమ కేసులు బనాయించారని వెంటనే ఎత్తివేయాలని 'అఖిలపక్ష కమిటీ' ఆధ్వర్యంలో కడప ఎమ్మెల్యే మాధవి అందుబాటులో లేనందున ఆమె భర్త, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ దేశ మసీదులు, దర్గాలు, వక్ఫ్ బోర్డు భూములను ముస్లిం అయి కూడా అంజాద్ బాషా ఆక్రమించడం, అక్రమ కేసులు పెట్టించటం అన్యాయమని తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వంతో మాట్లాడి సదరు కేసులు ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సి ఆర్ వి ప్రసాద్, సంఘ సేవకులు సలావుద్దీన్, బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి గురప్ప, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి బాదుల్లా, టిడిపి నాయకులు జిలాని బాష, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాసిర్ హుస్సేన్, నాసిర్ ఖాన్, లోక్‌సత్తా నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత సమస్యలపై మాట్లాడుతున్న ఎంపిడిఒ కోటేశ్వరరావు

సమయ పాలన పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపిడిఇఒ కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన పారిశుధ్యం, తాగునీరు వంటి వాటిపై ఆయన మాట్లాడారు. ప్రతి శుక్రవారం అన్ని గ్రామాలలో డ్రై డే పాటించాలని చెప్పారు. మెడికల్ అండ్ హెల్త్ వారు పాటించాల్సి ఉండగా కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లించుకోలేని స్థితిలో లింగారెడ్డి పల్లి గ్రామపంచాయతీ ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులతో చర్చించి అందుకు సంబంధించిన, పారిశుధ్య కార్మికులు, సరైన సమయానికి వచ్చి సచివాలయాన్ని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ముందుగా పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చి పనులు చేయించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు అనారోగ్యాల కారణమైతే అటు వైద్య సిబ్బంది, ఇటు పంచాయతీ సెక్రెటరీ తగిన సమాధానం ఇవ్వాల్సి వస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పరిశుధ్య కార్మికులకు మూడు నెలల వేతనాలు చెల్లించాలని, ఇది వరకే తెలియజేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం వస్తున్న వర్షాలు, సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క సచివాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని తెలిపారు.

క్రిమినల్‌ను వెనకేసుకుని రావడం తగదు

ప్రజాశక్తి - చాపాడు

మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత అయి ఉండి క్రిమినల్‌ను కలవడం, వెనుక వేసుకొని రావడం తగదని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి. మునిశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఒక పార్టీని నడిపే వ్యక్తి అందరికీ ఆదర్శంగా ఉండాలని, అయితే జగన్మోహన్ రెడ్డి తీరు విరుద్ధంగా ఉందని వాపోయారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఇవిఎం బాక్స్‌ను ధ్వంసం చేసి మాచర్లలో ఎన్నో అరాచకాలు చేసి హత్యకు కారకుడైన ఒక నేరస్తుడిని జగన్‌రెడ్డి వెనుక వేసుకు రావడం సిగ్గుచేటన్నారు. ఏ నాయకుడైనా ప్రజల నమ్మకాన్ని నిలుపుకోవాలని చూస్తారని జగన్ తీరు చూస్తుంటే అర్థం కావడం లేదని వాపోయారు. మోసపూరిత హామీలతో గెలిచాడు అని మాట్లాడటం తగదన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రజలను మోసం చేసింది ఎవరైందని ప్రజలకు తెలుసన్నారు. గత ఐదేళ్లలో నిత్యావసర సరుకులు పెంచి పేద ప్రజల కడుపు కొట్టడం, కల్తీ మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు తీయలేదా అన్నారు. ప్రతి ఏటా జాబ్ కేలెండర్ అని నిరుద్యోగులను మోసం చేయలేదా, రివర్స్ పిఆర్‌సితో ఉద్యోగులను మోసం చేయలేదా అని ప్రశ్నించారు.

ఎక్స్‌రే యంత్రాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఎక్స్ రే యంత్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా రైతు సేవా సమితి అధ్యక్షులు ఏవి రమణ కోరారు. గురువారం రైతు నాయకుడు కోటయ్యగారి గురప్పతో కలిసి మైదుకూరు ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు వైద్యశాలకు రోజూ 250 నుండి 300 వరకు రోగులు వైద్య సేవలకు వస్తున్నారని వైద్యశాలలో ఎక్స్ రే, సిటీ స్కాన్, ఎమ్మార్ఐ లాంటి యంత్ర పరికరాలు ఏర్పాటుచేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపిడిఒ సల్మాన్ రాజ్ సూచించారు. శుక్రవారం మండలంలోని బిసి హాస్టల్, కస్తూర్బా గురుకుల పాఠశాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. తాగునీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సుచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల ఆవరణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ గురుదేవి పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకునేనా?

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి రాత్రి రోజు అక్రమ మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నుంచి మట్టి తరలింపు జోరుగా సాగుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోగా మట్టి మాఫియాకు సహకరిస్తూ ఉండేవారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. గత రెండు రోజుల కిందట అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహ నాలను పోలీస్‌లు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. మండలం పరిధిలోని వివిధ ప్రాంతాలలో వాగులు గుట్టలు, కొండ ప్రాంతాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తుండేవారు. మైన్స్ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతుండేది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు సంబంధించి అడ్డుకట్టివేసి ప్రకృతి వనరులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తూ పట్టుబడిన వాహనాలను, అక్రమ రవాణా దారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారా లేక జరిమానాలతో సరిపెడతారా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో వదిలేస్తారా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

నేడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకా

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం ఆయా పశు వైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు ముద్దనూరు పశు వైద్యశాల ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ వాసా శ్రీనివాస తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుక్కకు రేబీస్ వ్యాధి రాకుండా ఉండేందుకు కుక్క కాటుకు గురైన మనిషికి వ్యాధి రాకుండా నివారించేందుకు రేబీస్ టీకా వేయించాలన్నారు. మండల కేంద్రంలోని పశు వైద్య శాల, కొత్తపల్లె, వేల్పుచెర్ల గ్రామాల్లోని పశు వైద్యశాలల్లో, కొర్రపాడు, నల్లబల్లె గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య శాలల్లో, తిమ్మాపురం,ఉప్పలూరులో రైతు సేవా కేంద్రాల్లో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకా వేయనున్నట్లు చెప్పారు. కొండాపురం మండలంలో కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు పశు వైద్యశాలలు, గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రాల్లో టీకాలు వేయిస్తామన్నారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు చెప్పారు.

ఢిల్లీలో అదృశ్యమైన బాలిక ముద్దనూరులో ప్రత్యక్షం

ప్రజాశక్తి - ముద్దనూరు

పోలీసుల అదుపులో ఉన్న బాలిక, యువకుడు

తూర్పు ఢిల్లీలో అదృశ్యమైన బాలిక ముద్దనూరులో గుర్తించినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. సిఐ వివరాల ప్రకారం తూర్పు ఢిల్లీలోని చిత్ర విహార్ జుగ్గీ, ప్రీత్ విహార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూన్18న బాలిక అదృశ్యంపై కేసు నమోదైనట్లు చెప్పారు. ఆ మేరకు ఢిల్లీ పోలీసులు బాలిక సెల్ ఫోన్ ఆధారంగా ముద్దనూరులో సిగ్నల్ చూపించడంతో ఢిల్లీ ఎస్ఐ ఇకరాబుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ వికాస్ కుమార్, మహిళా కానిస్టేబుల్ హేమ ఇక్కడి పోలీసులను ఆశ్రయించారు. స్థానిక సిబ్బంది సాయంతో గురువారం రాత్రి పెద్దదుద్యాల వద్ద ఉన్న తార ప్లాంటులో పని చేస్తున్న మొహ్మద్ రెహ్మాన్, స్నేహితుని వద్ద బాలిక ఆచూకీ గుర్తించినట్లు చెప్పారు. సదరు బాలికను ఆమె బంధువులకు అప్పగించామని సిఐ పేర్కొన్నారు. బాలిక ఆచూకీ కోసం సహకరించిన సిఐ దస్తగిరి, సిబ్బందికి ఢిల్లీ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

చెక్ డ్యాంలకు జలకళ

పంట సాగుకు చర్యలు - రజకులకు ఉపయోగకరం

వెదురూరు చెక్ డ్యామ్ వద్ద నిలిచిన నీరు

ప్రజాశక్తి - చాపాడు

గత వేసవిలో పూర్తిగా అడుగంటిన వాగులు, వంకలు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటితో కళకళలాడుతున్నాయి. చెక్ డ్యాములున్న ప్రాంతాల్లో మాత్రం జలకళ ఉట్టిపడుతోంది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో నీరు చెట్టు పనుల్లో భాగంగా మండల పరిధిలోని వంకలలో పూడికతీత పనులు చేపట్టి ఆ తర్వాత చెక్ డ్యాములను నిర్మించారు. సిద్దారెడ్డిపల్లె, సోమాపురం, బద్రిపల్లి, వెదురూరు, చియ్యపాడు, చాపాడు, అల్లాడుపల్లె, వెదురూరు గ్రామాల వద్ద వంకలలో పలు ప్రదేశాల్లో నీరు చెట్టు పనుల్లో భాగంగా చెక్ డ్యామ్‌లను నిర్మించారు. నిర్మించిన ప్రదేశానికి ఎగువన నీరు 100 మీటర్ల వరకు మూడు అడుగుల లోతున నిలిచి ఉంటుంది. కెసి కాలువలో నీరు ప్రవహిస్తుండడం వల్ల వంకలలో నీరు సమృద్ధిగా ఉంది. చెక్ డ్యాముల వద్ద నీరు అందుబాటులో ఉంటున్నది. సిద్ధారెడ్డి పల్లె, బద్రి పల్లె సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ డ్యామ్ వద్ద దోబీలు బట్టలు ఉతుకునేందుకు ప్రస్తుతం అనుగుణంగా నీరు ఉంటుంది. అలాగే ఈ నీటిని ఆధారం చేసుకుని రైతులు పంటలు సాగుకు చర్యలు చేపట్టారు. వంకలలో నీరు నిలిచి ఉండడంతో ప్రజలకు ఉపయోగకరంగా మారింది. ప్రతి 300 నుంచి 400 మీటర్లకు చెక్ డ్యామ్‌లను ఏర్పాటు చేస్తే నీరు ఎక్కడికక్కడ నిలిచి ఉపయోగకరంగా మారుతాయని రైతులు సూచిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెక్ డ్యాముల నిర్మాణాన్ని ఏమాత్రం చేపట్టలేదు. నీరు నిలుపుదల చేయగలిగితే చెక్ డ్యాముల సమీపంలోని గ్రామాల్లోని ప్రజలకు మంచినీటి కొరత తీరుతుంది. కుందూ, కెసిలలో నీరు ప్రవాహం ఉన్న సమయంలో పది అడుగుల్లోనే నీరు లభ్యమవుతుంది. వేసవిలో క్రమేపీ తగ్గుతూ 100 అడుగులకు పైగా లోతుకు చేరుకొని నీటి కటకటకు దారి తీస్తుంది. సాధారణంగా మండల పరిధిలోని రెండు మూడు పంచాయతీలు మినహా మిగిలిన గ్రామాల్లో నీటి కొరత ఏ మాత్రం కనబడకపోవడం మంచి పరిణామం. ఎండ తీవ్రతను నీటి సంరక్షణలో భాగంగా నీటి వనరులను అభివృద్ధి చేసుకోవాలి. ఇరిగేషన్ అధికారులు అవసరమైన ప్రదేశాల్లో చెక్ డ్యామ్ లను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

ఆర్‌టిసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

డిఎంకు వినతిపత్రాన్ని ఇస్తున్న సిఐటియు నాయకులు

జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఆర్‌టిసి డిపోలలో పనిచేస్తున్న స్వీపర్లకు ఇస్తున్న వేతనాలలో కోత కోస్తున్న విక్టరీ అసోసియేషన్ ప్రొప్రైటర్, కాంట్రాక్టర్ వాసుదేవ కుమార్ పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ప్రొద్దుటూరు ఆర్‌టిసి డిఎం మల్లికార్జునరెడ్డికి సిఐటియు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ , సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ స్వీపర్లకు రూ.11,202 వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.9,100 ఇచ్చి దోచుకోవడమే కాకుండా, తిరిగి రూ.3వేలు వెనక్కి తీసుకుంటున్నారని విమర్శించారు. ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా కట్టడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌గా చేరినప్పటి నుంచి ఇలాగే చేస్తున్నారని విమర్శించారు. ప్రొద్దుటూరులో బస్సులను క్లీన్ చేస్తున్న కార్మికులకు కేవలం రూ. 6వేలు మాత్రమే ఇస్తున్నారని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే విచారణ చేపట్టి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సల్మాన్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు చంటి, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ప్రస్తావన లేకపోవడం శోచనీయం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా ప్రస్తావన లేకపోవడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత కాగా ఇచ్చింది గోరంత అన్నారు. నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్రకు అనేక వరాలను ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదాను నవ్యాంధ్ర ప్రదేశ్‌లో 5 సంవత్సరాల పాటు అమలు చేస్తామని 2014 ఫిబ్రవరి 20 నాటి ప్రధాని పార్లమెంటులో ప్రకటన చేశారని గుర్తు చేశారు. పార్లమెంటుకు అమోదించిందని చెప్పారు. 5 ఏళ్లు కాదు 10 సంవత్సరాల పాటు ప్రత్యేక హోదాను ఇస్తామని నరేంద్ర మోడీ తిరుపతి బహిరంగ సభలో చెప్పడంతో పాటు బిజెపి తన ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టుకున్నట్లు చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా ముగిసిన అధ్యయనం అని చెప్పడం గమనార్హం అన్నారు. విభజన చట్టంలో సెక్షన్ 46 ప్రకారం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి కింద నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని చెప్పారు. రూ 24350 కోట్లకు గాను పిల్లికి బిచ్చం వేసినట్లు రూ 1050 కోట్ల మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. కడప జిల్లాకు సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ అమలు కాలేదని చెప్పారు. దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణం కాలేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారినట్లు తెలిపారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు రాలేదని తెలిపారు. విశాఖకు కొత్త రైల్వే జోన్ రాలేదని తెలిపారు. కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ రాలేదని తెలిపారు. బిజెపి మోసగారి తనం వల్ల, టిడిపి, వైకాపా ప్రభుత్వాల చేతగాని తనం వల్ల అమలు కాలేదని చెప్పారు. విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలై ఉంటే నవ్యాంధ్ర స్వర్ణాంధ్రగా మారి పోయేదని చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపికి మెజార్టీ పూర్తిగా లేదని కాబట్టి చట్ట బద్దంగా రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన వాటిని సాధించాలని కాంగ్రెస్ పార్టీ చంద్రబాబును డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు టిడిపి, జనసేన, బిజెపి పార్టీలను క్షమించారని చెప్పారు.

హాస్టల్ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న వినయ్‌కుమార్

జమ్మలమడుగు పట్టణంలో అన్ని స్థానిక ప్రభుత్వ పాఠశాల, కళాశాల సంక్షేమ, రెసిడెన్షియల్, గురుకుల, వసతి గృహంలో సరైన మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ బాధ్యులు ఏ.వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఉన్న వసతి గృహాల్లోని బిసి, ఎస్‌సి మధ్య తరగతుల విద్యార్థులకు అడ్మిషన్ కొరత లేకుండా చేయాలన్నారు. విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను, భోజనం మెనును క్రమ పద్ధతిలో పాటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కొన్ని ప్రాంతాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఇప్పటికే పట్టణంలోని రెండు వసతి గృహాలలో మున్సిపల్ అధికారులు తనిఖీలు చేయగా ఆర్ఒ ప్లాంట్ సరిగ్గా పని చేయలేదని, వెంటనే రిపేరు చేయాలని తెలిపారన్నారు. హాస్టల్ సిబ్బంది కూడా వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేస్తామని చెప్పారని తెలిపారు. ఇలాగే ఉంటే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడతారని వార్డెన్స్ చొరవ చూపి విద్యార్థులకు త్వరగా మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వంట ఏజెన్సీ వారికి కూడా సకాలంలో జీతాలు అందించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఇర్ఫాన్, పవన్, రాజు శ్రీనాథ్, పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

విద్యార్థినులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు శివశంకర్, శిరిష పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏకలవ్యవ పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు కౌమర దశలో మార్పుల గురించి వివరించారు. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాల పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్యులు శివబాబు, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యక్షులు షీలా ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిని కడప జోన్ కో-ఆర్డినేటర్ వెంకట సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

మార్కెట్ యార్డ్ సిబ్బందిని బెదిరించలేదు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

మాట్లాడుతున్న తూగుట్ల రాఘవరెడ్డి

టిడిపి ప్రభుత్వం 2015లో మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పని చేశా రని, అప్పుడు మార్కెట్ యార్డ్ ఎంతో అభివృద్ధికి కృషి చేశానని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టిడిపి నాయకుడు తూగుట్ల రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న సిబ్బందిని బెదిరించారని చెప్పడం అవాస్తవమని, 2019లో వైసిపి ప్రభుత్వం రాగానే మార్కెట్ యార్డులో పనిచేస్తున్న సిబ్బందిని ఎంపీ అవినాష్ రెడ్డి తొలగించారని అన్నారు. మార్కెట్ యార్డ్ సెక్రటరీ రత్న రా పై కోర్టుకు వెళ్లి పరువు నష్ట దావా వేస్తామని అన్నారు. సిబ్బందిని తొలగించకుండానే తొలగిస్తున్నట్లు ఎంపీ అవినాష్ రెడ్డి ఎందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. 2015లో ఇదే సిబ్బంది దొంగ బిల్లులు ఇస్తూ, దొంగ రిజిస్టర్ మైంటైన్ చేస్తూ ఉన్నప్పుడు కూడా వారిని మందలించామని చెప్పారు. అప్పుడు పని చేస్తున్న కార్యదర్శి కూడా దీనికి సంబంధించి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారని చెప్పారు. నాపై అసత్యపు ఆరోపణలు చేసిన సెక్రటరీ రత్నంరాజుపై చర్యలు తీసుకునేందుకు చట్టపరంగా ముందుకు వెళతామని అన్నారు. సింహాద్రిపురంలో పనిచేస్తున్న వారిని కూడా బెదిరించినట్లు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తాను బెదిరించినట్లు ఆధారాలు ఉంటే చూపించాలన్నారు. ఎవరిపైనైనా ఆరోపణలు చేసేటప్పుడు ఆధారాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబురెడ్డి, రమేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, అనంతరెడ్డి, ఓబయ్య పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అనారోగ్యం బారినపడి చికిత్స పొందుతున్నవారికి అందుతున్న సదుపాయాల గురించి రోగులను, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరైనా డబ్బులు అడిగారా అని బాలింతలను తెలుసుకున్నారు. ఆసుపత్రికి వస్తే డాక్టర్లు, సిబ్బంది పట్టించుకుంటున్నారా అంటూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులను, గర్భిణులతో ఆరా తీశారు. ఎవరైనా రోగుల దగ్గర డబ్బులు ఆశిస్తే ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు .వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ, రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. అనంతరం చిన్న పిల్లల వార్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ ఆనంద్ బాబు, వైద్యులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎల్లయ్య

పట్టణంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు తుడుమ్. ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథ కాలు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా ముఖ్యంగా విద్యార్థులు స్కూల్స్, కాలేజీలు, హాస్టల్స్ లలో చేరాలంటే ఆధార్ అప్డేట్ అవసరమని దీని కోసం ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పోస్ట్ ఆఫీస్, స్టేట్ బ్యాంకులో ప్రభుత్వ ఆధార్ కేంద్రాలు ఉండేవని, ఇప్పుడు అవేవీ లేవు అని తెలిపారు. అధికారులు స్పందించి ప్రజలు, విద్యార్థుల అవస రాలను దృష్టిలో పెట్టుకొని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన కోసం సమీక్ష

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వాస్పత్రిలో మౌలిక సదుపాయాల కోసం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జమ్మలమడుగు నగర పంచాయతీకి సంబంధించి ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి సూచనల మేరకు తాడిపత్రి రోడ్డులోని ప్రభుత్వ హాస్పిటల్‌లో మున్సిపల్ కమిషనర్ ఎన్. ప్రమోద్ కుమార్ సందర్శించారు. తన సిబ్బందితో పర్యటించి ఆస్పత్రిలో నీటి సరఫరా, శానిటేషన్, డ్రెయినేజీ వ్యవస్థ మొదలగు వాటిపై సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో ఎప్పటికప్పుడూ సమస్యలపై చొరవ చూపాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆరోగ్య సూత్రాలు తెలియ జేస్తున్న హైల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా

చేతుల శుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

డయేరియాను నిర్మూలించాలంటే ఆహారం తీసుకొనే సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని హైల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం అన్నారు. తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం డయేరియాపై విద్యార్థులకు స్థానిక గురుకుల ఉర్దూ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులు నిర్మూలించాలంటే వ్యక్తి గత పరిశుభ్రత చాలా అవసరం అన్నారు. నిల్వ ఆహారం తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజన్ అవుతుందని, దీని ద్వారా డయేరియా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు ఉత్పత్తి అనేది ఉంటుందని కాబట్టి ముగురు నీరు నిల్వ ఉండకుండ చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని చెప్పారు. జాగ్రత్తలు తీసుకొంటే వ్యాధులకు దూరంగా ఉండేందుకు అవకాశం ఉందని చెప్పారు. కాబట్టి ప్రతి విద్యార్థి ఆరోగ్య విషయాలపై కూడ అవగాహన కల్గి ఉండి ప్రజలకు తెలియజేయాలని కోరారు. పాత్రల్లో ఎక్కువ రోజు నీరు నిల్వ ఉంచితే పురుగులు ఏర్పడుతాయాని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ వెంకటరత్నం, ఎంపిహెచ్ఇఒ ఫకృద్దీన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుగుణమ్మ, సూపర్ వైజర్ వెంకట లక్ష్మమ్మ, ఉపాధ్యాయులు, ఆశా, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు గృహోపకరణాల వితరణ

ప్రజాశక్తి -పులివెందుల రూరల్ : లోక్ జనశక్తి పార్టీ జాతీయ అధ్యక్షులుగా పనిచేసిన కీ.శే. రామ్ విలాస్ పాశ్వాన్ 77వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో విభిన్న ప్రతిభావంతులకు గృహోపకరణాలు వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గౌస్ మోదీన్, పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు కిషోర్ కుమార్ రెడ్డి పాశ్వాన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. పాశ్వాన్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. ఈ సందర్భంగా గౌస్ మోదీన్ సమకూర్చిన గృహపకరణాలైన క్యారియర్లను 20 మందికి పంపిణీచేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, లోక్ జనశక్తి పార్టీ నాయకులు గౌస్ మోదీన్, కిషోర్ కుమార్ రెడ్డి, దళిత విభాగం నాయకులు రవికుమార్ , మైనార్టీ విభాగం నాయకులు అబ్దుల్లా, సునీల్ వేణు పాల్గొన్నారు.

మహారాజరాజశ్రీ తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 83/2023
మెసర్స్ శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ రెప్రజెంటెడ్ బై మేనేజింగ్ పార్టనర్ సగల సురేష్ బాబు ...వాది
V/s
1) బి.వెంకట సుబ్బారావు
2) వై.రాజేంద్రప్రసాద్ రెడ్డి ...ప్రతివాదులు
1వ ప్రతివాదికి దావా సమన్సు
బి.వెంకటసుబ్బారావు తండ్రి బి.చిన్న తిరుమలయ్య, డి.నెం.4-701, గీతాశ్రమం వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా
మీరు తిరుపతి సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో తేది. 30.12.2013న వై.రాజేంద్రప్రసాద్ రెడ్డి గారికి డాక్యుమెంట్ నెం.534/2013గా విక్రయ రిజిష్టరు చేసియున్నారు. సదరు విక్రయ పత్రమును క్యాన్సిల్ చేయమని పై దావాను వాది మీ ఇరువురిపై పై కోర్టు నందు దావా వేసియున్నారు. సదరు దావాను కోర్టు వారు తేది. 15.07.2024 వాయిదా వేసియున్నారు. కావున మీరు కాని మీ తరపున లాయరు గారు కాని హాజరై వాయిదా తేదీన సదరు కోర్టులో మీకు గల అభ్యంతరములను తెలుపవలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది. 15.07.2024, ఉ॥ 10.30 గం॥లకు
ఆనాల ప్రకాశం రెడ్డి, న్యాయవాది, తిరుపతి
సెల్: 9440120839

IN THE COURT OF THE Ist Addl. DIST JUDGE, KADAPA
I.A.No. 27/2022
M.V.O.P. No. 240/2020
Gajjala Rama Subba Reddy. **...Petitioner**
Vs
Aluru Alia Basha @ Aluru Alla Bakash, S/o Aluru Dasthagiri, Tractor Driver, D.No.2/210, Near Pavan School, Sastri Nagar, Kadapa City and other. **...Respondents**
NOTICE
పిటిషనరు తనకు ఆక్సిడెంట్‌లో కలిగిన గాయాలకు గాను నష్టపరిహారము కోరి పైకేసును పై కోర్టులో మీ పైన దాఖలు చేసియున్నారు. సదరు కేసు 16-07-2024వ తేదీన వాయిదాగా వుంటూ వున్నది. కావున పై తేదీన ఉదయం 10.30 గం॥లకు పైకోర్టులో హాజరై మీకేమైన ఆక్షేపణలు ఉన్నయడల తెలుపగలరు. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడును.
//By Court of the Order//
V.ADINARAYANA REDDY
D.ANANDA REDDY
Advocate,
Kadapa.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
E.P.No. 11/2022
O.S.No. 184/2017
నల్లం శివశంకర్, S/o సుబ్బయ్య, హిందూ, 69 సం॥లు, వ్యాపారం, సాకిన్ డోర్‌నెం.3/338, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు. 7989291032.
...పిటీషనర్/D.Hr
Vs
సింగం గంగాధర్‌రెడ్డి, S/o గంగిరెడ్డి, హిందూ, 55సం॥లు, డోర్‌నెం.3/532. వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు. సెల్: 9440218636. **...రెస్పాండెంట్/J.Dr**
నోటీసు
పై నెంబరు E.P.ని E.P.షెడ్యూలు దాఖల ఆస్థిని CPC U/O 21 Rule 54 ప్రకారం జప్తు చేయించి పైకం చెల్లించని పిదప CPC U/O 21 Rule 64 & 66 ప్రకారం వేలం జరిపించవలెనని కోరుచూ రెస్పాండెంట్/J.Dr అయిన నీ పైన దాఖలు చేసివున్నారు. అట్టి E.P. నందు J.Dr అయిన నీకు ఏవైనా ఆక్షేపణలు వున్న యెడల 25/9/2024వ తేదీన ఉ॥10.30 ని॥లకు స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున ఎక్సపార్టీగా తీర్మానించబడును అని ఇందుమూలముగ తెలియజేయడమైనది.
వాయిదా తేది: 25/9/2024
ఎన్.వి.వరప్రసాద్
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.